క్లుప్తంగా

శ్రీవిరించికి ఉత్తమ కవి పురస్కారం



శ్రీవిరించిని సత్కరిస్తున్న శ్రీలక్ష్మి, ప్రతాప్

భీమవరం: రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన ఏలూరులో నిర్వహిస్తున్న సాహిత్య సంక్రాంతి సంబరాల్లో భీమవరం వెస్ట్‌బెర్రీ స్కూల్ టీచర్ కడిమిళ్ల శ్రీవిరించిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ కవి పురస్కారంతో సత్కరించారు. అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, శ్రీకళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా శ్రీవిరించి పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కార గ్రహీతను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

కులగణనకు సిద్ధం కావాలి

ఆకివీడు: కుల గణన చేసేందుకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సిద్ధం కావాలని మండల విస్తరణాధికారి సుబ్బారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కుల గణపై అవగాహనా సదుస్సు జరిగింది. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు చెప్పే విధంగా వారి కులాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్‌లోని ప్రత్యేక యాప్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఉప కులాలు, వాటి వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా వారి వివరాలు సేకరించ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మీ, మండల పరిషత్ పరిపాలనాధికారి శ్రీకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయకుదురులో ధనుర్మాస పూజలు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుడారై ఉత్సవం జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. 108 గిన్నెలతో క్షీరాన్నాన్ని ప్రసాదంగా నివేదించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధానార్చకుడు నారాయణం శ్రీనివాస దీక్షితులు, నారాయణం ఫణికుమార్, భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నరసాపురం రూరల్: ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకున్న నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం చాగంటి వారి మెరక గ్రామానికి చెందిన కామిశెట్టి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షలు విలువైన చెక్కును చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పంపిణీ చేశారు. స్వయంగా ఆయనే వారి ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ప్రసాదరాజు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద కుటుంబాలకు ఒక వరంగా ఉందన్నారు.

వేములదీవి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కుడారై

నరసాపురం రూరల్: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి, పసలదీవి రామాలయం, పట్టణంలోని ఎంబర్‌మన్నార్ ఆలయాల్లో కుడారై విందు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ముందు వెన్న, చెక్కర పొంగలి, పులిహోర పదార్థాలను ఉంచి నైవేద్యంగా పెట్టారు. అనంతరం పాశురం చదివి ఉపన్యాసం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ఎంఎంకేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘ సభ్యుడు పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన తమ బ్యాచ్‌తో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దానిలో భాగంగా తొలుత 20 మంది బాధిత కుటుంబాలకు తమ వంతు సేవ చేయాలనే సంకల్పంతో పౌష్టికాహారం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశ్యావుల రవికుమార్, సుదర్శన్ శేషుబాబు, దిరిశాల వెంకట హరగోపాల్, అన్నం బాబ్జి, అనిశెట్టి సుబ్బరాజు, మామిడి రాంబాబు, వేగిరాతి భాస్కర్, గుణ్ణం రామాంజనేయులు, వంగా కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు: ఓటర్లందరూ ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు కోరారు. మండలంలోని కొమ్ముచిక్కాల, వేడంగి, వేడంగిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.రాంబాబు, సర్పంచ్‌లు, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా భీమవరం పట్టణాభివృద్ధి

- రూ.100 కోట్లతో పనులు చేశాం
- త్వరలో మరిన్ని పనులు చేపడతాం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కలెక్టరేట్‌కు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని త్రీ టౌన్‌లో రూ.4 కోట్ల 58 లక్షలతో నిర్మించిన పలు రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రూ.29 లక్షల నిధులతో పీపీ రోడ్డు జంక్షన్ నుంచి ఆర్టీసీ డిపో వరకు నిర్మించిన సీసీ రోడ్డు, మారుతీ నగర్ నుంచి ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ వరకు రూ.1.30 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.38 లక్షల నిధులతో కముజువారి పాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్, రూ.1.18 కోట్ల నిధులతో ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ నుంచి భారతీయ విద్యా భవన్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును, రూ.1.43 కోట్ల నిధులతో పీపీ రోడ్డు జంక్షన్ నుంచి భారతీయ విద్యా భవన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లగా భీమవరం పట్టణాభివృద్ధికి రూ.100 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు తెలిపారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతాయన్నారు. పట్టణంలో ఏ వార్డు చూసినా అభివృద్ధి స్పష్టంగా కనిపించేలా పనులు చేశామన్నారు. తాను గెలిచిన నాటి నుంచి పట్టణాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని ప్రజలకు మౌలిక వసతుల్లో భాగంగా సీసీ రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించామన్నారు. ప్రజలు అభీష్టం మేరకు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి సమస్యలు లేకుండా చేశామన్నారు. వార్డులో పర్యాటించి అక్కడ అవసరమైన రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్ట్‌లు నిర్మించడం ఓ ప్రణాళిక ప్రకారం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో భీమవరంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ఈ నాలుగున్నరేళ్లల్లోనే అభివృద్ధి జరిగిందని అది స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఈ త్రినాధరావు, పార్టీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, కోడే యుగంధర్, గాదిరాజు రామరాజు, ఏఎస్‌రాజు, సాగి విజయకృష్ణంరాజు, కట్టా రవి, చెల్లబోయిన సూర్యప్రకాష్, పేరిచర్ల సత్యనారాయణ రాజు,నల్లం రాంబాబు, చెన్ను చంటి, గంటా సుందర్‌కుమార్, అల్లూరి నాగవల్లి, కుప్పిలి వరం, రుద్రాక్షల శ్రీనివాస్, కామిశెట్టి అర్జున్‌రావు, వాసర్ల ప్రవీణ్, గూడూరు రాధాకృష్ణ, కముజు చిన్న, శ్రీనివాస్, కొత్తల నాగబాబు, కందికట్ల ఎడ్వర్డ్, పెచ్చేటి ప్రసాద్, నూకల కనకరావు, కృష్ణబాబు, మింది అప్పల మూర్తి, బొత్స ధర్మా, కైలా పాండురంగారావు, చెల్లంకి గిరి, పంపన శ్రీనివాస్, కొమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ విజయ భారతి

ఆకివీడు: వృద్ధులకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతమని తహసీల్దార్ విజయ భారతి చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. లయన్స్ ప్రతినిధి పల్లి అప్పిరెడ్డి 100 మందికి వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లకు విరాళం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ వృద్ధులకు చేస్తున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, ఆదర్శ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు, పల్లి అప్పిరెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన



కోపల్లెలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు.కోపల్లె గ్రామంలో సుమారు రూ. 23 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు)తో సంయుక్తంగా పీవీఎల్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు.కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో పలు ప్రాంతాల్లో రూ.23 లక్షలతో సీసీరోడ్లు నిర్మించుకోగలిగామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో పనులు పూర్తి చేశామన్నారు. అలాగే జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనులను దాతల సహకారంతో ప్రారంభించినట్లు తెలిపారు. గత పాలకుల మాదిరి కాకుండా కొబ్బరికాయలు కొట్టి వదిలేసి ప్రజలను మోసగించట్లేదని అన్నారు. చెప్పింది చెప్పినట్టే చేసే నాయకుడైన ముఖ్యమంత్రి మనకు ఉన్నాడని అన్నారు. కోపల్లె గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలను మోసగించడానికి కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎంపీపీ శిరీషవిశ్వనాథరాజు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే పీవీఎల్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు, ఎంపీపీ పెన్మత్స విశ్వనాథరాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు, బాలం సత్యనారాయణ, దంతులూరి కోటేశ్వరరాజు, వేగేశ్న సుమన్, రామారావు, గోళ్ల సత్యనారాయణ, పెన్మత్స రంగరాజు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా రోడ్డు నిర్మాణ పనులు



చిలుకూరులో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

ఉండి: సంక్రాంతి పండుగ వేళ జోరుగా రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. మండలంలో మహదేవపట్నం నుంచి జాతీయ రహదారి వరకు, చిలుకూరు నుంచి మహదేవపట్నం, ఉండి జాతీయ రహదారి నుంచి వాండ్రం వరకు సీయంఆర్ఎఫ్ నిధులు రూ.4.5 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్లు మరమ్మతుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గత వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లను పండుగ వేళకు సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని చిలుకూరులో నిర్మాణం చేపట్టిన రోడ్డు పనులను గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముదునూరి వెంకటసోమరాజు పరిశీలించారు. సంక్రాంతి పండుగవేళ రోడ్లు నిర్మాణం చేపట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులైన సీయంఆర్ఎఫ్ నిధులు సుమారుగా రూ.100 కోట్లు తీసుకువచ్చి నియోజకవర్గంలో రోడ్లు నిర్మాణం చేపట్టిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



ఉండి: ఉప్పలూరులో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



పాలకోడేరు: విజేతగా నిలిచిన పెన్నాడ వాలీబాల్ జట్టు

ఉండి: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో జరుగుతున్న పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం ఉప్పులూరులో షటిల్ పోటీలు, ఉండిలో క్రికెట్ పోటీలు ఎంతో ఉత్కంఠగా సాగాయి. క్రికెట్ పోటీలు లీగ్ మ్యాచ్‌లు కొనసాగుతుండగా షటిల్ పోటీలు మాత్రం ముగిసాయి. షటిల్ పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో ఉండి 2, ఎన్నార్పీ అగ్రహారం జట్లు ఫైనల్ చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో 2–1 తేడాతో ఉండి జట్టు ఎన్నార్పీ అగ్రహారం జట్టుపై విజయం సాధించింది. అలాగే మహిళల విభాగంలో చిలుకూరు సచివాలయం జట్టు, ఎన్నార్పీ అగ్రహారం జట్టుపై విజయం సాధించి మండల స్థాయి విజేతలుగా నిలిచాయి. ఈ పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.కొండలరావు, రిఫరీ రామకృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన పెన్నాడ వాలీబాల్ జట్టు

పాలకోడేరు: మండలంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. విద్యార్థులు, యువత చురుగ్గా పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చాటుతున్నారు. మండలంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో 18 టీమ్‌లు తలపడగా, పెన్నాడ టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టు ఉండి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటుంది. వీరిని పెన్నాడ సర్పంచ్ చిల్లా అనూష సత్యనారాయణ, కార్యదర్శి కె.లక్ష్మి, సచివాలయం గ్రేడ్ 5 కార్యదర్శి రావూరి దుర్గాభ్రమరాంబిక, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్, అప్పారావు, పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు అభినందించారు.

వీరవాసరంలో..

వీరవాసరం: 'ఆడుదాం ఆంధ్ర' మండల స్థాయి పోటీలు శుక్రవారంతో ముగిసాయి. వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాయికుదురు టీం–2 జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కబడ్డీలో కొణితివాడ–2 జట్టు, బ్యాడ్మింటన్ పోటీల్లో వీరవాసరం–3 జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. మండల స్థాయిలో విజేత జట్లు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని మండల ప్రత్యేకాధికారి బి.సుజాతారాణి, ఎంపీడీవో కె.జ్యోతి, ఆర్.శ్రీనివాసరావు, వాసు, మూర్తి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ కృషి

భీమవరం 33వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'



భీమవరం 33వ వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడూరి ఉమాబాల, పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, బీసీ సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షుడు, కోడే యుంగధర్, పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 33వ వార్డులో ×వై ఏపీ నీడ్స్ జగన్× కార్యక్రమం వార్డు ఇన్‌చార్జ్‌లు ముత్యాల బుజ్జి, తాళ్లపూడి పరమేశ్వరరావు ఆధ్వర్యాన జరిగింది. ముందుగా వార్డులో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాల అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్య,, వైద్యం, ఉపాధికి లక్షల కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రిగా జగన్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, చినిమిల్లి వెంకట్రాయుడు, రేవూరి గోగురాజు, చెన్ను చంటి, మానేపల్లి నాగన్నబాబు, ముల్లు నరసింహమూర్తి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, పాలపర్తి జోనా, కందికట్ల ఎడ్వర్డ్, కరీముల్లా బాషా, గాదిరాజు రామరాజు, పాలవెల్లి మంగ, గుంటి ప్రభు, కైలా పాండురంగారావు, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఏలూరుపాడు స్కూల్‌లో సమావేశమైన 1995-96 నాటి పూర్వ విద్యార్థులు



ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో 1994-95 బ్యాచ్ విద్యార్థులు

కాళ్ల : మండలంలో 1995–96 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏలూరుపాడు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగింది. స్నేహ బంధం, ఎంత మధురమో అంటూ నాటి విద్యార్థులంతా ఒకేచోట చేరి పాతజ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. 28 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా పూర్వ విద్యార్థులు హాజరుకావడంతో పాఠశాల ప్రాంగణమంతా సందడిగా మారింది. మరోసారి కలుద్దాం అంటూ చివరిగా ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు.

ఉండి: మండలంలోని 1994–95 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌లో సందడి వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలు నెరమరువేసుకుంటూ ఒకరినొకరు మరోమారు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి రోజుల్లో తమకు విద్యాబుద్దులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎంవి సత్యనారాయణ, రుద్రరాజు సురేష్, డోకల గోపీచంద్, లోకారపు రాము, రుద్రరాజు సునీత, డాక్టర్ సుబ్బలక్ష్మీ, నక్కా రాజ్‌కుమార్, కిశోర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పేదోడి ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం



అయిభీమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న గాలి సామ్రాజ్యం

ఆకివీడు: పేదోడి ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం శుక్రవారం అయిభీమవరం సచివాలయం వద్ద జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రతి పేదోడూ ఆరోగ్యంగా బ్రతకాలనే నాలుగున్నరేళ్లుగా జగనన్న అనేక ఆరోగ్య పథకాలు అమలు జేస్తున్నారని చెప్పారు. జేసీఎస్ మండల కన్వీనర్ పుప్పాల పండు మాట్లాడుతూ వైద్యం అందని ద్రాక్షగా ఉన్న ఈ రోజుల్లో ఇంటింటికీ వచ్చి ప్రభుత్వ వైద్యులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ప్రజల యోగ క్షేమాల్ని తెలుసుకుని వైద్యం అందజేయడం సీఎం జగన్ ఘనతేనన్నారు. పేదవాడికి వైద్యం, విద్య అందుబాటులో ఉండాలంటే మళ్లీ సీఎంగా జగనే రావాలని ప్రతి ఒక్కరూ కోరుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో గౌడలకు అధిక ప్రాధాన్యం

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గౌడ సమాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ ప్రతిక ప్రకటన ద్వారా శుక్రవారం తెలిపారు.ఇటీవల విడుదల చేసిన ఇన్‌చార్జ్‌ల జాబితాలో గౌడ సామాజికవర్గానికి 5 సీట్లు కేటాయిస్తూ అధిక ప్రాధాన్యత ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు తీమంతా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం



కాజ తూర్పు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: రాష్ట్ర ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని కలగజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు అన్నారు. కాజ తూర్పు గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలకు కూడా కార్పొరేట్ తరహా వైద్యం ఉచితంగా అందజేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. శిబిరంలో డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ సతీష్‌లు 426 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యాతం సత్యనారాయణ, పాలంకి వెంకటేశ్వరరావు, కొప్పినీడి భాస్కరరావు, చించినాడ జయశ్రీను, కొక్కిరిగడ్డ రాజేంద్ర ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని డంపింగ్ యార్డు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఉండి పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.28,530 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎ సూర్యనారాయణ తెలిపారు

అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్

పెనుగొండ: అధునాతన పరిజ్ఞానంతో తయారవుతున్న భారతి సిమెంట్ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడంతో పాటు, భవన నిర్మాణ కార్మికుల శ్రేయస్సుకు అండగా నిలుస్తోందని కంపెనీ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.భవానీశంకర్ తెలిపారు. పెనుగొండలో తేజశ్రీ స్టీల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన జరిగిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మేస్త్రిలకు ఉచిత బీమా బాండ్‌లు అందించారు. శాశ్వత భవన నిర్మాణాలకు సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన సిమెంట్ ఎంపిక చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో, దీర్ఘకాలం మన్నేందుకు భారతి సిమెంట్ దోహదపడుతుందన్నారు. సదస్సులో సేల్స్ ఆఫీసర్ పి.రాజా, తేజశ్రీ స్టీల్ కార్పొరేషన్ యజమాని శ్రీనివాస రెడ్డి, భవన నిర్మాణ మేస్త్రిలు పాల్గొన్నారు.

నేడు టిడ్కో లబ్ధిదారులకు ప్లాట్‌లు అప్పగింత

పాలకొల్లు అర్బన్: పట్టణ పేదల కోసం పెంకుళ్లపాడులో నిర్మించిన టిడ్కో గృహాలను శనివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 700 మంది లబ్ధిదారులకు ప్లాట్‌లను అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యాన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేతుల మీదుగా ప్లాట్లను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.